రాహుల్ వ్యాఖ్యలపై రభస

- హిందువులుగా చెప్పుకునే కొందరు హింస, విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని వ్యాఖ్య
- అభ్యంతరం తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ
- రాహుల్ క్షమాపణ చెప్పాలని షా డిమాండ్
- బీజేపీ గురించి మాత్రమే అన్నాను: రాహుల్

లోక్‌సభలో శివుడి చిత్రాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ని ఉద్దేశించి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు లోక్‌సభలో గందరగోళం సృష్టించాయి. రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు ప్రధాని మోదీ, అమిత్ షా సహా బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మొదటిసారిగా ప్రతిపక్ష నేత హోదాలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పరమశివుడి చిత్రపటాన్ని చూపిస్తూ.. 'హిందువులు ఎప్పుడూ భయాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేయరు. కానీ, హిందువులుగా చెప్పుకునే కొందరు మాత్రం కేవలం హింస, విద్వేషం, అసత్యమే మాట్లాడతారు. మీరు హిందువులే కాదు' అంటూ బీజేపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు లేచి నిలబడి అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో మతపరమైన చిత్రాలను చూపించవద్దంటూ స్పీకర్ ఓం బిర్లా కూడా రాహుల్‌ను నిలువరించే ప్రయత్నం చేశారు.

ఇది చాలా తీవ్రమైన అంశం: నరేంద్ర మోదీ

రాహుల్ గాంధీ వ్యాఖ్యల పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర అభ్యంతరం తెలిపారు. యావత్ హిందూ సమాజాన్ని హింసాత్మకమైనదిగా పేర్కొనడం చాలా తీవ్రమైన అంశమని ఆయన పేర్కొన్నారు. అయితే, తాను బీజేపీ గురించి మాట్లాడుతున్నానని, బీజేపీ, ఆర్ఎస్ఎస్, మోదీ అంటే మొత్తం హిందూ సమాజం కాదని రాహుల్ గాంధీ స్పష్టత ఇచ్చారు. హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. హిందువులుగా గుర్తింపు పొందేందుకు గర్వపడుతున్న కోట్లాది మంది ప్రజల మనోభావాలను గాయపరిచినందుకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ దేశమంతా భయోత్పాతాన్ని వ్యాప్తి చేసిందని, రాహుల్ గాంధీకి అసలు అహింసపై మాట్లాడే హక్కు లేదని అమిత్ షా పేర్కొన్నారు.

రాజ్యాంగంపై దాడి: రాహుల్ గాంధీ

భారత్ అనే భావన, రాజ్యాంగంపై పూర్తి స్థాయిలో, ప్రణాళికబద్ధంగా దాడి జరిగిందని ఆరోపించారు. రాజ్యాంగంపై దాడిని ప్రతిఘటించిన ప్రతిపక్ష నేతలపైనా వ్యక్తిగత దాడి జరిగిందని, ఇప్పటికీ కొందరు జైలులో ఉన్నారని పేర్కొన్నారు. 'ప్రధాని మోదీ ఆదేశాలతో నాపైనా దాడి జరిగింది. నా మీద 20కిపైగా కేసులు ఉన్నాయి. నా ఇల్లు తీసేసుకున్నారు. 55 గంటల పాటు నన్ను ఈడీ విచారించింది.' అని రాహుల్ ఆరోపించారు. తన ప్రసంగంలో అయోధ్యలో బీజేపీ ఓటమిని రాహుల్ ప్రస్తావించారు. 'వాళ్లు(బీజేపీ) భయాన్ని వ్యాప్తి చేసినంత వరకూ నేను అయోధ్య గురించి మాట్లాడతా. రామ జన్మభూమి మీకు(బీజేపీ) స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది.' అని పేర్కొన్నారు. ఈ సమయంలో తన పక్కనే కూర్చున్న అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో గెలుపొందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవదేశ్ ప్రసాద్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి 'శభాష్' అంటూ అభినందించారు. ప్రభుత్వం నీట్‌ను వాణిజ్య పరీక్షగా మార్చేసిందని, ఇది కేవలం ధనికుల కోసం రూపొందించిందని, ప్రతిభావంతులైన వారి కోసం కాదని రాహుల్ ఆరోపించారు.

రాహుల్ గాంధీపై చర్యలు ?

లోక్‌సభలో బీజేపీని విమర్శిస్తూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారుతున్నాయి. హిందువులకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఉన్నాయని బీజేపీ ఆరోపిస్తున్నది. తాను కేవలం బీజేపీని మాత్రమే అన్నానని రాహుల్ స్పష్టత ఇచ్చినప్పటికీ వివాదం సమసిపోలేదు. రాహుల్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా లోక్‌సభ స్పీకర్‌ను బీజేపీ కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

67 నుంచి 61కి తగ్గిన టాపర్లు

- నీట్ యూజీ రీటెస్ట్ ఫలితాలు వెల్లడి
- సవరించిన ర్యాంకుల జాబితా విడుదల

న్యూఢిల్లీ, జూలై 1: నీట్ యూజీ-2024 రీటెస్ట్ ఫలితాలు విడుదల య్యాయి. వీటితోపాటు సవరించిన ర్యాంకుల జాబితాను ఎన్‌టీఏ సోమవారం ప్రకటించింది. వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. 6 కేంద్రాల్లో ఈ పరీక్ష ఆలస్యంగా జరగడం వల్ల సమయాన్ని కోల్పోయిన 1,563 మంది అభ్యర్థులకు పరిహారంగా గ్రేస్ మార్కులు ఇచ్చారు. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా 67 మందికి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆ 1,563 మంది అభ్యర్థుల గ్రేస్ మార్కులను రద్దు చేసి, గత నెల 23న మళ్లీ పరీక్ష నిర్వహించారు. కానీ, వారిలో 813 మంది మాత్రమే రెండోసారి పరీక్షకు హాజరయ్యారు. మిగిలిన 750 మంది అభ్యర్థులు గ్రేస్ మార్కులు లేకుండా మొదట వచ్చిన మార్కులనే కోరుకున్నట్టు ఎన్‌టీఏ అధికారులు తెలిపారు. కాగా, గ్రేస్ మార్కుల కారణంగా ఆరుగురు అభ్యర్థులు 720/720 మార్కులు సాధించి టాప్ ర్యాంకులో నిలవగా, గ్రేస్ మార్కుల తొలగింపు తర్వాత వారిలో ఐదుగురు రీటెస్ట్‌కు హాజరయ్యారు. కానీ తాజా ఫలితాల్లో వారికి ఫుల్ మార్కులు సాధించలేదు. దీంతో టాప్ ర్యాంకర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గింది.

4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

పిలుపునిచ్చిన వామపక్ష విద్యార్థి సంఘాలు

న్యూఢిల్లీ: పేపర్ లీకేజీలను నిరసిస్తూ జూలై 4న దేశవ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదితర వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరాయి. నీట్, నెట్ పేపర్ లీకేజీలకు నిరసనగా దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షల నిర్వహణలో విఫలమైన ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇవే డిమాండ్‌లతో జూలై 4న బంద్‌కు పిలుపునిచ్చాయి. మరోవైపు నీట్ అక్రమాలను నిరసిస్తూ మంగళవారం విద్యార్థి సంఘాలు పార్లమెంట్ మార్చ్ చేపట్టనున్నాయి.జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరవధిక నిరసనలు సోమవారం 6వ రోజుకు చేరుకున్నాయి.

యూపీఎస్సీ ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, జూలై 1: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2024 ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మెయిన్స్ పరీక్షకు క్వాలిఫై అయిన అభ్యర్థుల రోల్ నంబర్లతో జాబితాను యూపీఎస్సీ విడుదల చేసింది. జూన్ 16న ఈ పరీక్ష నిర్వహించారు. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షల ప్రక్రియ పూర్తయి తుది ఫలితాలు వచ్చాక, అభ్యర్థుల మార్కులు, కటాఫ్ మార్కులు, ఆన్సర్ కీలను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

ఓఎంఆర్ మ్యానిపులేషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: నీట్-యూజీలో ఓఎంఆర్ షీట్ మ్యానిపులేషన్ జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణను సుప్రీంకోర్టు సోమవారం రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ పరీక్ష రాసిన ఓ విద్యార్థి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషనర్ రాసిన ఓఎంఆర్ షీటును మార్చేశారని ఆయన తరపు న్యాయవాది ఆరోపించారు. దీనిపై వెకేషన్ బెంచ్ స్పందిస్తూ, జూన్ 23న జరిగిన రీటెస్ట్‌కు హాజరయ్యేందుకు పిటిషనర్ అనుమతి కోరారని తెలిపింది. ఆ పరీక్ష అయిపోయిందని చెప్పింది. దీనిపై రెండు వారాల తర్వాత విచారణ జరపాలని ఎన్టీఏ న్యాయవాది కోరారు.

ఇంజినీర్ రషీద్ ప్రమాణానికి ఎన్ఐఏ అంగీకారం

న్యూఢిల్లీ: లోక్ సభ ఎన్నికల్లో జమ్ముకశ్మీరు నుంచి ఎన్నికైన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజినీర్ రషీద్) ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయడానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అంగీకరించింది. దీంతో అదనపు సెషన్స్ జడ్జి చందర్ జిత్ సింగ్ మంగళవారం దీనిపై ఆదేశాలను జారీ చేస్తారు. రషీద్ ఈ నెల 5న లోక్ సభలో ఎంపీగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఆయన ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఇంజినీర్ రషీద్‌ను ఉగ్రవాదులకు నిధుల చేరవేత కేసులో అరెస్ట్ చేశారు. ఆయన బారాముల్లా నుంచి ఎంపీగా గెలిచారు. ప్రమాణం చేయడానికి తనకు తాత్కాలిక బెయిలు మంజూరు చేయాలని ఆయన కోర్టును కోరారు. దీంతో కోర్టు ఎన్ఐఏ స్పందనను కోరింది.

ఆర్ఎస్ఎస్‌తో దేశానికి ప్రమాదం

- రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శలు
- వ్యతిరేకించిన రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్
- ఆర్ఎస్ఎస్ సభ్యుడు కావడం నేరమా అని ప్రశ్న

న్యూఢిల్లీ, జూలై 1: ఆర్ఎస్ఎస్‌ను ఉద్దేశించి రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు సభలో రచ్చ రాజేశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం జరిగిన చర్చలో ఖర్గే ప్రసంగించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అంశాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. వీసీలు, ప్రొఫెసర్లుగా తమ సభ్యులను నియమిస్తూ విశ్వవిద్యాలయాలు, ఎన్‌సీఈఆర్‌టీ సహా విద్యాసంస్థల్లోకి ఆర్ఎస్ఎస్ చొరబడుతున్నదని ఆరోపించారు. అన్ని సంస్థలను ఒకే సంస్థ గుప్పిట్లో తీసుకుందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి దేశంలోని సంస్థలను నాశనం చేయని పేర్కొన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులతో పాటు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ కూడా అభ్యంతరం తెలిపారు. ఆర్ఎస్ఎస్ దేశం కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్నదని, అందులో ఎంతోమంది మేధావులు ఉన్నారని ధన్‌కర్ పేర్కొన్నారు. ఖర్గే వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. ఆర్ఎస్ఎస్‌కు సభ్యుడిగా ఉండటం నేరమా అని ఆయన ఖర్గేను ప్రశ్నించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పందిస్తూ.. ఖర్గేకు ఆర్ఎస్ఎస్ గురించి ఏమాత్రం అవగాహన లేదని, ఆ సంస్థ గురించి ఖర్గే మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు.

మీడియా అనుమతులపై ఆంక్షల్ని ఎత్తేయండి

ఓం బిర్లా, జగదీప్ ధన్‌కర్‌లకు 'ఎడిటర్స్ గిల్డ్' లేఖ

న్యూఢిల్లీ: పార్లమెంట్ కార్యక్రమాల కవరేజీకి సంబంధించిన మీడియా అనుమతులపై ఆంక్షల్ని తొలగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ ధన్‌కర్‌లను ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా కోరింది. సోమవారం ఈ మేరకు లేఖ రాసింది. అదనపు పాసులు అవసరం లేకుండా, అన్ని మీడియాల్లో పనిచేసే గుర్తింపు ఉన్న ఉద్యోగులందరికీ పూర్తిస్థాయిలో అనుమతులు ఇచ్చే విధానాన్ని పునరుద్ధరించాలని ధన్‌కర్‌ను కోరింది. శాశ్వత అక్రిడేషన్ ఉన్న వారితో సహా మీడియా వ్యక్తుల సంఖ్యను పరిమితం చేసే పద్ధతి 'కొవిడ్-19' ప్రొటోకాల్ అమల్లో ఉండగా కేంద్రం తీసుకొచ్చిందన్న సంగతిని ఓం బిర్లాకు రాసిన లేఖలో 'ఎడిటర్స్ గిల్డ్' ప్రస్తావించింది. 'ప్రెస్ అడ్వయిజరీ కమిటీ'ని తిరిగి ఏర్పాటుచేయకపోవటంపై ఆందోళన వ్యక్తం చేసింది.

మణిపూర్‌లో జాతుల మధ్య చిచ్చుకు ఆజ్యం!

యూకేలోని భారత సంతతి ప్రొఫెసర్ ఉదయ్‌రెడ్డిపై కేసు

ఇంఫాల్: ఆన్‌లైన్ సందేశాలు, చర్చ కార్యక్రమాల ద్వారా భారత్‌కు చెందిన యూకే ప్రొఫెసర్ మణిపూర్‌లో జాతుల మధ్య విద్వేషానికి ఆజ్యం పోస్తున్నారని ఇంఫాల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కెనడాలోని ఖలిస్థానీ వేర్పాటువాదులతో సదరు ప్రొఫెసర్‌కి సంబంధాలున్నాయని పలువురు స్థానికులు ఆరోపించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం సదరు ప్రొఫెసర్‌ను బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పనిచేసే ఉదయ్ రెడ్డిగా గుర్తించారు. 'మైతీల మత విశ్వాసాలను అవమానించేలా, ఇతర జాతులతో వారికి ఉద్రిక్తతలు పెరిగేలా నిందితుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు' అని ఇంఫాల్ తూర్పు జిల్లా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే దీనిపై ఉదయ్ ఇంతవరకు స్పందించలేదు.

నన్ను బహిష్కరిస్తే 63 మంది ఎంపీలను కోల్పోయారు

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర సోమవారం లోక్‌సభలో బీజేపీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. గత లోక్‌సభలో తనను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, 'నా నోరు మూయించాలని వారు (బీజేపీ) ప్రయత్నించారు. ప్రజలు వారి నోరు మూయించారు. దీనివల్ల వారు 63 మంది ఎంపీలను కోల్పోయారు' అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

వాణిజ్య సిలిండర్ ధర రూ.30 తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 1: అంతర్జాతీయ చమురు ధరల్లో మార్పులకు అనుగుణంగా దేశీయంగా 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.30 తగ్గింది. దీంతో ప్రస్తుతం దీని ధర రూ.1,646గా నమోదైంది. ఇదే సమయంలో విమాన ఇంధనం(ఏటీఎఫ్) రేటు 1.2 శాతం పెరిగింది. దీని ప్రకారం ఢిల్లీలో కిలో లీటర్ ఏటీఎఫ్ ధర రూ.1179.37 పెరిగి రూ.96,148.38కి చేరింది. వాణిజ్య సిలిండర్ ధరను గత నాలుగు నెలలుగా వరుసగా తగ్గిస్తున్నారు. మరోవైపు గృహావసరాలకు వాడే వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

మేధా పాట్కర్‌కు ఐదు నెలల జైలు

ఢిల్లీ: 23 ఏండ్ల నాటి పరువునష్టం కేసులో సామాజిక కార్యకర్త మేధాపాట్కర్‌కు ఢిల్లీ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష, రూ. 10 లక్షల జరిమానా విధించింది. ఈ ఆదేశాలపై ఆమె అప్పీలుకు వెళ్లేందుకు శిక్షను నెల పాటు వాయిదా వేసింది. పాట్కర్ ఓ టీవీ చానల్‌లో తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ 2001లో ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా ఆమెపై పరువునష్టం కేసు వేశారు. తాజాగా ఈ కేసులో మేజిస్ట్రేట్ రాఘవ్‌శర్మ తీర్పు వెలువరించారు. అంతకుముందు 2000వ సంవత్సరంలో సక్సేనాపై పాట్కర్ దావా వేశారు. అప్పటి నుంచి వీరి మధ్య వివాదం కొనసాగుతున్నది. పరిశీలన షరతులపై తనను విడుదల చేయాలన్న పాట్కర్ విజ్ఞప్తిని న్యాయమూర్తి తిరస్కరించారు.



మహారాష్ట్ర తొలి మహిళా సీఎస్‌గా సుజాత సౌనిక్

ముంబై: మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) సుజాత సౌనిక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో 64 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. సీఎస్ నితిన్ కరీర్ పదవీ విరమణ చేయడంతో సుజాత ఈ పదవిలో నియమితులయ్యారు. ఆమె 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. ఆమె భర్త మనోజ్ సౌనిక్ కూడా గతంలో సీఎస్‌గా పని చేశారు.

అమల్లోకి కొత్త న్యాయ చట్టాలు

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో తొలి కేసు • శిక్ష కంటే న్యాయానికే ప్రాధాన్యం: షా

న్యూఢిల్లీ, జూలై 1: దేశంలో కొత్త న్యాయ చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(సీఆర్పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం(బీఎన్ఏ) ఇక నుంచి అమలులో ఉండనున్నాయి. శిక్ష కంటే న్యాయం చేయడానికి ప్రాధాన్యతను ఇస్తూ కొత్త చట్టాలను చేసినట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. నేరాలపై సులువుగా ఫిర్యాదు చేసేలా ఈ-ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. కొత్త చట్టం కింద మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ద్విచక్ర వాహనం దొంగతనానికి సంబంధించి మొదటి కేసు నమోదైనట్టు ఆయన తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు బదులుగా చేసిన కొత్త చట్టాలపై రాజకీయాలు చేయవద్దని ఆయన ప్రతిపక్ష పార్టీలను కోరారు. కాగా, 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత బలవంతంగా ఈ చట్టాలను చేశారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. సరైన చర్చ, సంప్రదింపులు జరపకుండా కొత్త చట్టాలను చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం ఆరోపించారు.

420 ఇక నుంచి 318

ఐపీసీ స్థానంలో బీఎన్ఎస్ అమలులోకి రావడంతో సెక్షన్లలో కూడా చాలా మార్పులు జరిగాయి. కాలం చెల్లినవి తొలగించి, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా కొత్త సెక్షన్లు చేశారు. మొత్తంగా ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా ఇప్పుడు బీఎన్ఎస్‌లో 358 చట్టాలు మాత్రమే ఉండనున్నాయి. సెక్షన్ల నెంబర్లు కూడా మారాయి. ఉదాహరణకు.. చీటింగ్ కేసుకు సంబంధించి ఐపీసీ సెక్షన్ 420 ఉండేది. ఇది అందరి మెదళ్లలో ఎక్కువగా పాతుకుపోయింది. అనేక సినిమా డైలాగుల్లోనూ వినిపించింది. ఇప్పుడు బీఎన్ఎస్‌లో చీటింగ్ కేసుకు సెక్షన్ 318 వర్తించనుంది. ఇలా అనేక సెక్షన్లలో మార్పులు జరిగాయి

కుర్చీ దిగేందుకు 'సిద్ధ'మేనా?

- కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న వర్గపోరు
- డీకేను సీఎం చేయాలంటూ ఒక వర్గం డిమాండ్
- హైకమాండ్ చెప్పింది చేస్తానన్న సిద్ధరామయ్య
- డీకేకు చెక్ పెట్టేలా పావులు కదుపుతున్న సిద్ధూ వర్గం
- బయట మాట్లాడొద్దని చెప్పున్నా వినని ఎమ్మెల్యేలు
- ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదికే తీవ్రమైన 'కుర్చీ' కొట్లాట

బెంగళూరు, జూలై 1: కర్ణాటక కాంగ్రెస్‌లో పవర్ పాలిటిక్స్ తారస్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదికే సీఎం కుర్చీ కోసం కొట్లాట ముదురుతున్నది. పార్టీ ఇచ్చిన వార్నింగ్‌లను లెక్కచేయకుండా ఎమ్మెల్యేలు బాహాటంగానే తమ డిమాండ్లు వినిపిస్తున్నారు. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా కొనసాగేలా చూసేందుకు ఆయన వర్గం ఎమ్మెల్యేలు, డీకే శివకుమార్‌ను సీఎంను చేసేందుకు ఆయన వర్గీయులు పావులు కదుపుతున్నారు. ఈ మొత్తం తతంగాన్ని సిద్ధరామయ్య, డీకే శివకుమార్ తెరవెనుక నుండి నడిపిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

50:50 ఫార్ములా పాటిస్తారా ?

గత ఏడాది మే నెలలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అప్పుడు కూడా ముఖ్యమంత్రి పదవి కోసం పీఠముడి నెలకొన్నది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇద్దరూ కుర్చీ కోసం తీవ్రంగా పోటీ పడ్డారు. చివరకు సిద్ధరామయ్యనే అదృష్టం వరించింది. అయితే, అప్పుడు ముఖ్యమంత్రి పదవిని మొదటి రెండున్నరేండ్లు సిద్ధరామయ్యకు, తర్వాతి రెండున్నరేండ్లు డీకే శివకుమార్‌కు ఇచ్చేలా ఒప్పందం జరిగిందనే ప్రచారం జరిగింది. ఈ ఒప్పందం నిజమే అయితే మరో ఏడాదిన్నరలో ముఖ్యమంత్రి మార్పు ఉండనుంది. అందుకే, ఇప్పటి నుంచి సిద్ధరామయ్య, డీకే వర్గాలు పదవి కోసం పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా, ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయేందుకు సిద్ధరామయ్య సిద్ధంగా ఉన్నారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

సిద్ధరామయ్య దిగిపోవాలి

సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవిని వదులుకొని డీకే శివకుమార్‌ను అప్పగించాలనే డిమాండ్లు పెరిగాయి. ఇటీవల సీఎం పదవి నుంచి తప్పుకొని డీకే శివకుమార్‌కు ఇవ్వాలని విశ్వ ఒక్కలిగ మహాసంస్థాన మఠానికి చెందిన చంద్రశేఖర స్వామి నేరుగా సిద్ధరామయ్యనే కోరారు. చెన్నగిరి ఎమ్మెల్యే శివగంగ బసవరాజ్ కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారు. డీకే శివకుమార్ వల్లే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని, ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పదేపదే కోరుతున్నారు. డీకే శివకుమార్ క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేశారని, ఆయన సీఎం కావాలని అంటున్నారు. ఏడాదిన్నరలో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని డీకే వర్గీయులు ఈ డిమాండ్లను తెరపైకి తెచ్చారనే ప్రచారం జరుగుతున్నది.

ఇప్పటి నుంచే డీకేకు చెక్

ఇదే సమయంలో డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్‌లోనే ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. డీకే తన పీసీసీ అధ్యక్ష పదవిని వదులుకోవాలని కొందరు నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు డీకే ఒక్కరే ఉప ముఖ్యమంత్రిగా ఉండగా, మరో ముగ్గురిని కూడా ఉపముఖ్యమంత్రులను చేయాలని మంత్రి రాజన్న సహా మరికొందరు కోరుతున్నారు. ముఖ్యమంత్రి మార్పు ఉండకుండా చూసేందుకు డీకేకు ఇప్పటినుంచే చెక్ పెట్టేలా సిద్ధరామయ్య వర్గం ఈ డిమాండ్లు తెర మీదకు తెచ్చిందనే ప్రచారం జరుగుతున్నది. ముఖ్యమంత్రి పదవి విషయమై కాంగ్రెస్ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాము పాటిస్తామని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోమవారం ప్రకటించారు. డీకే శివకుమార్ కూడా హైకమాండ్ చెప్పిందే ఫైనల్ అంటున్నారు.

ఫ్రాన్స్‌లో రైట్ వింగ్ ప్రభుత్వం?

- తొలి రౌండ్ ఫలితాల్లో ఆర్ఎన్ పార్టీ ముందంజ
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మొదటిసారి

మరైన్

పారిస్, జూలై 1: ఫ్రాన్స్‌లో ప్రభుత్వం మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం జరిగిన తొలి రౌండ్ పార్లమెంటరీ ఎన్నికల్లో మరైన్ లీ పెన్ సారథ్యంలోని రైట్ వింగ్ పార్టీ నేషనల్ ర్యాలీ(ఆర్ఎన్) ముందంజలో నిలిచింది. మొత్తం ఓట్లలో ఆర్ఎన్ కూటమికి 35.15 శాతం ఓట్లు దక్కగా, వామపక్ష న్యూ పాపులర్ ఫ్రంట్(ఎన్ఎఫ్‌పీ) 27.99 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇమ్మాన్యూయెల్ మాక్రాన్ నేతృత్వంలోని మధ్యేవాద ఎన్‌సెంబుల్ అలయెన్స్ కేవలం 20.76 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది. దీంతో నేషనల్ ర్యాలీ పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మొదటిసారిగా ఫ్రాన్స్‌లో రైట్ వింగ్ అధికారంలోకి రానున్నది. కాగా, జూన్ 9న జాతీయ అసెంబ్లీని రద్దు చేసిన మాక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు.

రూ.200తో అంతరిక్షయానం!

భారతీయులకు యూఎస్ స్పేస్ ఏజెన్సీ ఆఫర్

న్యూఢిల్లీ, జూలై 1: కేవలం రూ.200 చెల్లించి (2.5 డాలర్లు) పేరు రిజిస్ట్రేషన్